బుల్డోజర్లకు బ్రేకులు

- నోటీసులు ఇవ్వకుండా ఆస్తులు కూల్చొద్దు
- అప్పీల్, జవాబు చెప్పుకునే అవకాశం ఇవ్వాలి
- అధికారులు జడ్జీల్లా మారి శిక్షలు వేయొద్దు
- అక్రమంగా కూలిస్తే జీతం నుంచి పరిహారం
- ఆస్తుల కూల్చివేతలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు
- కూల్చివేతలపై రాష్ట్రాలకు మార్గదర్శకాలు జారీ

న్యూఢిల్లీ, నవంబర్ 13: బుల్డోజర్ న్యాయానికి సుప్రీంకోర్టు బ్రేకులు వేసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్నారనే కారణంతో అధికారులే న్యాయమూర్తులుగా మారి ఇండ్లు కూల్చేయడం లాంటి శిక్ష విధించడం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని ఆక్షేపించింది. బుల్డోజర్‌తో ఇంటిని కూల్చేసి మహిళలు, చిన్నారులు, వృద్ధులను రాత్రికి రాత్రి నిరాశ్రయులు చేసే దృశ్యం భయంకరమైనదని అభివర్ణించింది. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఆస్తులు కూల్చడానికి వీలు లేదని స్పష్టం చేసింది. కూల్చివేతలపై అనుసరించాల్సిన ప్రక్రియపై రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద అధికారాలను వినియోగించి రాష్ట్రాలకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను జారీ చేసింది. పలు రాష్ట్రాల్లో అవలంబిస్తున్న బుల్డోజర్ న్యాయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం బుధవారం 95 పేజీల కీలక తీర్పు వెలువరించింది.

అధికారులే న్యాయమూర్తులుగా మారొద్దు

పలు కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల ఇండ్లను అధికారులు కూల్చేయడంపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. 'అధికారే న్యాయమూర్తులుగా మారి ఓ వ్యక్తిని దోషిగా నిర్ణయించి, అతడి ఆస్తులను కూల్చడం ద్వారా శిక్ష విధించడం కుదరదు. ఇలా చేయడం అధికారి తన పరిమితులను దాటడంతో పాటు అధికారాల విభజన సూత్రాన్ని ఉల్లంఘించడమే అవుతుంది' అని స్పష్టం చేసింది. న్యాయవ్యవస్థ దాని ప్రధాన విధులు నిర్వర్తించకుండా కార్యనిర్వాహక వ్యవస్థ భర్తీ చేయలేదని వ్యాఖ్యానించింది. సహజ న్యాయానికి సంబంధించి కనీస సూత్రాలు పాటించకుండా, సరైన ప్రక్రియను అవలంబించకుండా నిర్మాణాన్ని కూల్చేయడం చట్ట విరుద్ధమని పేర్కొన్నది. అధికారం ఉంది కదా అనే భావనతో ఇష్టారీతిన వ్యవహరించే తీరును ఇది గుర్తు చేస్తున్నదని వ్యాఖ్యానించింది. రాజ్యాంగంలో ఇలాంటి ఏకపక్ష, అతిగా అధికారాన్ని ఉపయోగించే చర్యలకు చోటు లేదని స్పష్టం చేసింది.

ఇల్లు కూల్చడమంటే కుటుంబం మొత్తాన్ని శిక్షించడమే

ఒక వ్యక్తి ఏదైనా కేసులో నిందితుడిగా లేదా దోషిగా ఉన్నందుకు ఆ వ్యక్తి నివసించే ఇంటిని కూల్చేయడం అంటే ఆ ఇంట్లో నివసించే మొత్తం కుటుంబానికి శిక్ష విధించడమే అని కోర్టు పేర్కొన్నది. ఇది అరాచకమని, రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును ఉల్లంఘించడమే అని స్పష్టం చేసింది. ఇల్లు ఉండటం ఏ వ్యక్తికైనా సంతృప్తిని ఇస్తుందని, గౌరవాన్ని, నాది అనే భావనను కలిగిస్తుందని, భవిష్యత్తు, భద్రతపై ఆశను కల్పిస్తుందని జస్టిస్ గవాయి అన్నారు. సగటు పౌరుడికి ఇంటి నిర్మాణం అనేది ఏండ్ల తరబడి పడ్డ శ్రమ, కల, ఆకాంక్షలకు పరాకాష్ట అని, దానిని తొలగించాలంటే అధికారులు కచ్చితంగా వేరే మార్గం లేదని సంతృప్తి చెందాలని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ప్రముఖ హిందీ కవి ప్రదీప్ రాసిన కవిత్వాన్ని ప్రస్తావించారు.

బుల్డోజర్ ఇక ఎప్పటికీ గ్యారేజ్‌లోనే: అఖిలేశ్ యాదవ్

బుల్డోజర్ న్యాయంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. 'సుప్రీంకోర్టు పెద్ద ఆదేశాన్ని ఇచ్చింది. ఇది బుల్డోజర్ చర్యలను నిలిపేస్తుంది. బుల్డోజర్‌ను సుప్రీంకోర్టు ఎప్పటికీ గ్యారేజ్‌లోనే ఉండేలా పార్క్ చేసేసింది' అని ఆయన వ్యాఖ్యానించారు. బుల్డోజర్ యాక్షన్ పేరుతో రాష్ట్రంలో పేదల ఇండ్లను కూల్చేశారని, అయోధ్యలో బీజేపీ ఓటమికి కూడా ఇదే కారణమని పేర్కొన్నారు.

కూల్చివేతలపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలు

- ముందస్తు షోకాజ్ నోటీసు లేకుండా నిర్మాణాన్ని కూల్చేయొద్దు. యాజమాని లేదా ఆక్రమణదారుడికి రిజిస్టర్ పోస్టు ద్వారా నోటీసు ఇవ్వడంతో పాటు నిర్మాణం బయట అంటించాలి.
- నోటీసు అందుకున్న వ్యక్తి సమాధానం చెప్పేందుకు స్థానిక మున్సిపల్ చట్టాలు సూచించిన సమయం లేదా 15 రోజుల గడువులో ఏది ఎక్కువ అయితే అది ఇవ్వాలి.
- సదరు నిర్మాణం ఏ రకంగా నిబంధనలకు విరుద్ధమో నిర్దిష్ట కారణాన్ని నోటీసులో పేర్కొనాలి. నోటీసుకు జవాబుగా ఏయే డాక్యుమెంట్లను అందించాలి, వ్యక్తిగత విచారణకు ఏ అధికారి ముందు, ఎప్పుడు హాజరు కావాలో స్పష్టంగా తెలియజేయాలి.
- నోటీసులో గత తేదీని వేశారనే ఆరోపణలు రాకుండా, నోటీసు ఇచ్చిన విషయాన్ని ఈమెయిల్ ద్వారా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తెలియజేయాలి. దీనిని ధ్రువీకరిస్తూ కలెక్టర్ కార్యాలయం నుంచి ఆటోజనరేటెడ్ రిప్లై వెళ్లాలి.
- నోటీసు అందుకున్న వ్యక్తి స్పందనను వ్యక్తిగతంగా వినే అవకాశం ఇచ్చిన తర్వాతనే అధికారులు తుది ఉత్తర్వులు ఇవ్వాలి.
- నోటీసు అందుకున్న వ్యక్తి ఇచ్చిన జవాబు ఏంటి? దానిని ఏ కారణంతో తిరస్కరిస్తున్నారో తుది ఉత్తర్వుల్లో అధికారి పేర్కొనాలి.
- నోటీసు గడువు ముగిసినా స్టే లభించనప్పుడు, కూల్చివేయాలని తుది ఉత్తర్వులు ఇచ్చిన తర్వాత యజమాని లేదా ఆక్రమణదారుడు తన అనధికార నిర్మాణాన్ని సొంతంగా తొలగించేందుకు, కూల్చేసేందుకు 15 రోజుల గడువు ఇవ్వాలి.
- కూల్చివేత ప్రక్రియను వీడియో తీసి భద్రపర్చాలి.
- ఈ ఉత్తర్వులను ఉల్లంఘించి కూల్చివేత జరిపితే సంబంధిత అధికారులు బాధ్యత వహించాలి. నష్టపరిహారం చెల్లించడంతో పాటు సొంత ఖర్చుతో ఆస్తిని పునరుద్ధరించాలి.
- ప్రతి మున్సిపాలిటీ, స్థానిక సంస్థ మూడు నెలల్లోగా ఒక ప్రత్యేక డిజిటల్ పోర్టల్‌ను ఏర్పాటు చేయాలి. ఇందులో నోటీసులు ఇవ్వడం, జవాబు, షోకాజ్ నోటీసు, ఆర్డర్ వంటి వివరాలను అందుబాటులో ఉంచాలి.
- అన్ని రాష్ట్రాలు ఈ ఆదేశాల గురించి తెలియజేస్తూ జిల్లా మెజిస్ట్రేట్లు, స్థానిక అధికార వ్యవస్థలకు సర్క్యులర్లు జారీ చేయాలి.
- నెలలోగా కలెక్టర్లు ప్రత్యేక నోడల్ అధికారులను నియమించి మున్సిపాలిటీలకు తెలియజేయాలి.
- రోడ్లు, ఫుట్‌పాత్, రైల్వే లైన్, నదులు, నీటి వనరులు వంటి పబ్లిక్ ప్లేస్‌లలో ఉన్నఅక్రమ నిర్మాణాలకు, కూల్చివేయాలని కోర్టు ఉత్తర్వులు ఉన్న వాటికి ఈ మార్గదర్శకాలు వర్తించవు.

తప్పుడు ప్రకటనలు ఇస్తే మూతే

- అనుమతి లేనిదే అభ్యర్థుల ఫొటోలు వాడొద్దు
- కోచింగ్ సెంటర్లకు కేంద్రం కొత్త మార్గదర్శకాలు
- తప్పుదోవ పట్టించే ప్రకటనలకు అడ్డుకట్ట

న్యూఢిల్లీ: పోటీ పరీక్షలకు శిక్షణనిచ్చే కోచింగ్ సెంటర్లు తప్పుడు ప్రకటనలు ఇవ్వకుండా నియంత్రించేందుకు సెంట్రల్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ(సీసీపీఏ) కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. పలు కోచింగ్ సెంటర్లు తప్పుడు ప్రకటనలపై నేషనల్ కన్జ్యూమర్ హెల్ప్‌లైన్‌కు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో బుధవారం ఈ మార్గదర్శకాలను ప్రకటించింది. వీటి ప్రకారం ఇక మీద కోచింగ్ సెంటర్లు '100 శాతం జాబ్ గ్యారెంటీ' వంటి ప్రకటనలు ఇవ్వడానికి వీల్లేదు. కోచింగ్ సెంటర్లు ఉద్దేశపూర్వకంగా విద్యార్థుల వద్ద కొంత సమాచారాన్ని దాస్తున్నందున ఈ మార్గదర్శకాలను జారీ చేసినట్టు వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖారే తెలిపారు. కోచింగ్‌కు సంబంధించి పలు నిర్వచనాలను సైతం మార్గదర్శకాల్లో సీసీపీఏ పొందుపరిచింది. మార్గదర్శకాలను ఉల్లంఘించిన కోచింగ్ సెంటర్లపై కన్జ్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్ – 2019 కింద జరిమానా విధించడం, లైసెన్సులు రద్దు చేయడం, కోచింగ్ సెంటర్లు మూసివేయడం వంటి చర్యలు తీసుకోనున్నారు.

కోచింగ్‌కు సంబంధించిన నిర్వచనాలు

కోచింగ్: విద్యార్థులకు విద్యా సంబంధ మార్గదర్శకత్వం చేయడం, సూచనలు ఇవ్వడం. క్రీడలు, కళలు వంటి విద్యతో సంబంధం లేని అంశాలకు వర్తించదు.

కోచింగ్ సెంటర్: 50 మంది కంటే ఎక్కువ విద్యార్థులు కలిగి ఉండే సంస్థ.

ఎండార్సర్: కోచింగ్ సెంటర్లకు ప్రచారం చేసే వ్యక్తులు.

కోచింగ్ సెంటర్లకు జారీ చేసిన మార్గదర్శకాలు

- కోర్సులు, కాలపరిమితి, అధ్యాపకుల అర్హతలు, ఫీజు, రిఫండ్ విధానాలు, ఫలితాలు, జాబ్ గ్యారెంటీ వంటి అంశాలపై తప్పుదోవ పట్టించే ప్రకటనలు నిషేధం.
- అధ్యాపకులు, వసతులు, ఇతర వనరులపై కోచింగ్ సెంటర్లు కచ్చితమైన సమాచారాన్ని వెల్లడించాలి.
- విద్యార్థుల విజయగాథలను వారి అనుమతి లేకుండా వినియోగించుకోవద్దు. విద్యార్థుల పేర్లు, ఫొటో, టెస్టిమోనియల్స్‌ను ప్రకటనల్లో వాడుకునేందుకు విద్యార్థుల నుంచి రాతపూర్వక అనుమతి పొందాలి.
- విద్యార్థుల గురించి ఇచ్చే ప్రకటనల్లో వారి పేరు, సాధించిన ర్యాంకు, వారు తీసుకున్న కోర్సు వివరాలు, శిక్షణ కోసం వారు ఫీజు చెల్లించారా వంటి విషయాలు స్పష్టంగా తెలియజేయాలి.
- విద్యార్థులపై ఒత్తిడి తెచ్చేందుకు 'కొన్ని సీట్లే మిగిలి ఉన్నాయి' వంటి ప్రకటనలు ఇవ్వొద్దు. విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావొద్దు.
- తప్పుదోవ పట్టించే ప్రకటనలపై ఫిర్యాదు చేసేందుకు వీలుగా కోచింగ్ సెంటర్లు కచ్చితంగా నేషనల్ కన్జ్యూమర్ హెల్ప్‌లైన్‌లో నమోదు కావాలి.
- కోచింగ్ సెంటర్లకు ప్రచారం కల్పించే ముందు ఎండార్సర్లు వాటి ప్రకటనలను ధ్రువీకరించుకోవాలి.

జీవితాన్ని ఉత్సవంగా మలుచుకోవాలి

ఆర్ట్ ఆఫ్ లివింగ్ మహా సత్సంగంలో శ్రీశ్రీ రవిశంకర్

విజయవాడ: జీవితం చాలా చిన్నదని, దీనిని ఉత్సవంగా మలుచుకొని ఆనందంగా గడపాలని ఆధ్యాత్మికవేత్త శ్రీశ్రీ రవిశంకర్ పేర్కొన్నారు. కార్తీకమాస క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా విజయవాడలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ మహా సత్సంగం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీశ్రీ రవిశంకర్ హాజరై ప్రసంగించారు. 1981లో ఇదే రోజు వేద విజ్ఞాన మహా విద్యాపీఠం పేరుతో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రారంభమైనట్టు ఆయన గుర్తు చేశారు. ప్రజలు మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆత్మవిశ్వాసం, దైవ విశ్వాసం, ధైర్యం ఉంటే ఏదైనా సాధించవచ్చని పేర్కొన్నారు. అంతకుముందు ఏపీ మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఏర్పాటు చేసిన యూనిటీ ఇన్ డైవర్సిటీ కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన్నారు.

బ్రిటిష్ రచయిత్రి సమంత హార్వేకు బుకర్ ప్రైజ్

లండన్: బ్రిటిష్ రచయిత్రి సమంత హార్వే బుకర్ ప్రైజ్–2024 విజేతగా నిలిచారు. ఆమె రచించిన 'ఆర్బిటాల్' నవలకు ఈ గౌరవం దక్కింది. ఈ బహుమతి కింద ఆమెకు సుమారు రూ.53.74 లక్షలు లభిస్తాయి. లండన్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విజేతను ప్రకటించారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో ఆరుగురు వ్యోమగాముల జీవితాల్లో ఒక రోజు కార్యకలాపాల గురించి ఈ నవలలో అద్భుతంగా వివరించారు. సమంత మాట్లాడుతూ, దీనిని తాను రోదసి సోగసుదనం గురించి రాసే ప్రక్రియగా భావించానని చెప్పారు.

ట్రంప్ సర్కార్‌లో మస్క్, రామస్వామి

'ఎఫిషియెన్సీ' శాఖ బాధ్యతలు

వాషింగ్టన్, నవంబర్ 13: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తన గెలుపునకు దోహదపడ్డ వారికి డొనాల్డ్ ట్రంప్ కీలక బాధ్యతలు అప్పగిస్తున్నారు. టెస్లా సీఈవో ఎలాన్ మస్క్, భారతీయ అమెరికన్ వివేక్ రామస్వామికి 'ఎఫిషియెన్సీ' శాఖ బాధ్యతలు అప్పగించారు. మెరుగైన పాలన, ప్రభుత్వంలో వృథా ఖర్చుల్ని తగ్గించే ఎఫిషియెన్సీ శాఖకు వారిద్దరూ నేతృత్వం వహిస్తారని మంగళవారం రాత్రి ట్రంప్ ప్రకటించారు. ట్రంప్ నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం వచ్చే ఏడాది జనవరి 20న కొలువుదీరనున్నది. ఇందులో చోటుదక్కించుకున్న మొదటి భారతీయ అమెరికన్‌గా వివేక్ రామస్వామి(37) నిలుస్తారు. కేరళకు చెందిన రామస్వామి తల్లిదండ్రులు అమెరికాకు వలస వెళ్లిన తర్వాత, అక్కడి ఓ జనరల్ ఎలక్ట్రిక్ ప్లాంట్‌లో పనిచేశారు.

దేశం వీడుతున్న అమెరికన్లు!

- డొనాల్డ్ ట్రంప్ ఎన్నికల వాగ్దానాల అమలుపై భయాందోళన
- గర్భస్రావం, లింగమార్పిడి ఆపరేషన్ల నియంత్రణపై వ్యతిరేకత
- యూరప్, లాటిన్ అమెరికాకు వలస వెళ్లేందుకు ఆసక్తి

వాషింగ్టన్, నవంబర్ 13: అమెరికా వెళ్లాలని కలలు గనని భారతీయుడు ఉండరు. ఇక వెళ్లే అవకాశం లభించిన వారు ఎన్నో ఆశలతో ఆ గడ్డపై అడుగు పెడుతుంటారు. స్వేచ్ఛకు మారుపేరుగా పేరొందిన అమెరికా ప్రతిభావంతులను ఎప్పుడూ నిరుత్సాహపరచదు. ఇందుకోసం కొంతమంది దొడ్డిదారిలోనైనా సరే అమెరికా వెళ్లేందుకు ప్రయత్నిస్తుంటారు. కానీ గత వారం రోజుల వ్యవధిలో పరిస్థితి తారుమారైంది. భారత్‌తోపాటు పలు దేశాలకు చెందిన పౌరులు అమెరికాలో స్థిరపడేందుకు వేచి చూస్తుండగా.. అమెరికన్లలో కొద్ది మంది మాత్రం దేశం వీడి వెళ్లే ప్రయత్నాల్లో ఉన్నట్టు పలు వార్తా సంస్థలు వెల్లడిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ గెలిచిన తరువాత ఈ ధోరణి మరింత పెరిగినట్టు తెలుస్తున్నది.

ట్రంప్ విధానాలపై ఆందోళన..

అమెరికా ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే చాలామంది నొమాడ్ వీసాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. విదేశాల్లో ఉంటూ సొంతదేశంలోని కంపెనీ కోసం పనిచేసేందుకు నొమాడ్ వీసా అనుమతిస్తుంది. వీసా గడువు ముగిసేంతవరకూ వీరు విదేశాల్లో ఉంటూ పనిచేసుకోవచ్చు. ఎన్నికల ఫలితాల అనంతరం చాలామంది యూరోప్, కెనడా, మెక్సికో వంటి దేశాలకు వలస వెళ్లడం ఎలా అన్నదానిపై గూగుల్‌లో వెతికినట్టు వెల్లడైంది.

తమను తాము స్వేచ్ఛాజీవులుగా చెప్పుకొనే అమెరికన్లు.. ట్రంప్ హయాంలో తమపై అణచివేత తప్పదని భావిస్తున్నారు. వలసలను అదుపుచేస్తానని, గర్భస్రావాలను, లింగమార్పిడి శస్త్ర చికిత్సలను అరికడతానన్న ట్రంప్ ఎన్నికల వాగ్దానాలపై దేశంలో మిశ్రమ స్పందన వ్యక్తమవుతున్నది. ట్రంప్ విధానాలను వ్యతిరేకించే వారిలోనే ఎక్కువ మంది దేశం విడిచి వెళ్లే ప్రయత్నాల్లో ఉన్నట్టు న్యూయార్క్ టైమ్స్, యూఎస్ఏ టుడే వంటి సంస్థలు పేర్కొన్నాయి. 2016లో ట్రంప్ గెలిచినప్పుడు కూడా ఇదే ధోరణి కనిపించిందని ఆ పత్రికలు గుర్తుచేశాయి.

దేశం వీడటమే బెటర్!..

'నా స్నేహితుల్లో కనీసం 50 శాతం మంది రాజకీయ కారణాలతోనే దేశం వీడి వెళ్లాలనుకుంటున్నారు' అని పోర్చుగల్‌కు వలస వెళ్లిన జస్టిన్ నెప్పర్ (48) అనే అమెరికన్ తెలిపాడు. ట్రంప్ విధానాల కారణంగా ఇబ్బందులు తప్పవని భావిస్తున్న చాలామంది దేశం విడిచి వెళ్లిపోవడమే ఉత్తమమని భావిస్తున్నట్టు డైర్డ్రే రోనీ అనే మహిళ తెలిపింది. దేశం విడిచి వెళ్లాలనుకుంటున్నవారు తమ అభిప్రాయాలను పంచుకొనేందుకు ఏకంగా ఆర్/అమెరెగ్జిట్ పేరిట ఒక సామాజిక మాధ్యమాన్ని ప్రారంభించారు. ట్రంప్ గెలవగానే ఈ పోర్టల్‌లో పోస్ట్‌లు వెల్లువెత్తాయి. ఈ వేదిక ద్వారా వివిధ దేశాల్లో ఉన్న ఉపాధి అవకాశాల గురించి వారు పరస్పరం సమాచారం అందించుకున్నారు. పౌరుల భద్రత విషయంలో 162 దేశాలలో అమెరికా 131 స్థానంలో ఉన్నది. అమెరికన్లు దేశం విడిచి వెళ్లేందుకు ఇది కూడా ఒక కారణమని, భద్రత కోసం చాలామంది యూరోపియన్ దేశాలవైపు చూస్తున్నారని న్యూయార్క్ టైమ్స్ తెలిపింది.

బుర్జ్ ఖలీఫా కన్నా ఎత్తైన భవనం!

అమెరికాలో నిర్మాణానికి సన్నాహాలు

న్యూయార్క్, నవంబర్ 13: ప్రపంచంలోనే ఎత్తయిన భవనం అంటే అందరికీ దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫా గుర్తుకు వస్తుంది. 828 మీటర్లు (2,717 అడుగుల) ఎత్తుతో 2009 నుంచి ఈ భవనం ప్రపంచంలోనే ఎత్తైనదిగా ప్రసిద్ధి చెందింది. అయితే అమెరికాలోని న్యూయార్క్‌లో నిర్మించనున్న ఒక ఆకాశహర్మ్యం ఈ రికార్డును తుడిచిపెట్టేయనుంది. యూఎస్‌కు చెందిన సన్ కథనం ప్రకారం అత్యంత లగ్జరీ నివాస ఆకాశహర్మ్యాలు నిర్మించే బిలియనర్స్ రో గ్రూప్ న్యూయార్క్‌లోని మన్‌హట్టన్ మధ్యప్రాంతంలో 4,000 అడుగుల ఎత్తుతో ఒక మహా భవనాన్ని నిర్మించనున్నది. రివర్స్ 'యూ' ఆకారంలో చేపట్టే ఈ బిగ్ బెండ్ ప్రాజెక్టు కనుక పూర్తయితే బుర్జ్ ఖలీఫా వెలవెలపోవడం ఖాయం. ఆధునికంగా తిరగబడ్డ 'యూ' ఆకారంలో నిర్మించే ఈ భవనం ఒక ఇంజనీరింగ్ అద్భుతం కానుంది.

6జీ టెక్నాలజీతో సంతానోత్పత్తి సమస్యలు

టెరాహెట్జ్ రేడియేషన్‌పై శాస్త్రవేత్తల ఆందోళన

బీజింగ్: 5జీ ఇంటర్నెట్ వినియోగంతో ఇప్పటికే శరవేగంగా పరుగులు తీస్తున్న ప్రపంచం.. తదుపరి తరం వైర్‌లెస్ (6జీ) టెక్నాలజీని అందిపుచ్చుకునేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నది. కానీ, 6జీ టెక్నాలజీకి ప్రపంచం చేరువవుతున్న కొద్దీ సరికొత్త ఆందోళన తెరపైకి వస్తున్నది. టెరాహెట్జ్ రేడియో ధార్మికత వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు శాస్త్రవేత్తలను కలవరపెడుతున్నాయి. టెరాహెట్జ్ తరంగాలు 6జీ సాంకేతికతకు వెన్నెముక లాంటివి. వీటి నుంచి ఓ రకమైన విద్యుదయస్కాంత రేడియో ధార్మికత (ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ రేడియేషన్) వెలువడుతుంది. ఈ తరంగాల వల్ల ఎన్నో లాభాలతోపాటు నష్టాలు కూడా ఉన్నాయి. టెరాహెట్జ్ తరంగాలతో మానవాళి ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉన్నదని, ముఖ్యంగా పురుషుల్లో సంతానోత్పత్తి సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉన్నదని ఇటీవల చైనా సైనిక శాస్త్రవేత్తల అధ్యయనంలో తేలింది. పురుషుల సంతానోత్పత్తి శక్తిపై తీవ్రంగా ప్రభావం చూపగలదని నిర్ధారణ అయ్యింది.

ట్రంప్ మదిలో 'మూడో పర్యాయం'

రిపబ్లికన్ పార్టీ ప్రతినిధులతో కీలక వ్యాఖ్య

వాషింగ్టన్, నవంబర్ 13: అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు స్వీకరించనున్న డొనాల్డ్ ట్రంప్ 'మూడో పర్యాయం'పైనా కన్నేసినట్టు కనిపిస్తున్నది. బుధవారం ఆయన రిపబ్లికన్ పార్టీ తరఫున ఎన్నికైన చట్టసభ సభ్యులతో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'నేను బాగా పని చేస్తున్నానని మీరు అనకపోతే నేను మరోసారి పోటీ చేయనేమో' అంటూ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై ఆసక్తికర చర్చ మొదలయ్యింది. అమెరికా రాజ్యాంగం ప్రకారం ఒక వ్యక్తి రెండుసార్లకు మించి అధ్యక్షుడిగా పని చేయడానికి వీలు లేదు. ఒకవేళ ట్రంప్ మూడోసారి అధ్యక్షుడిగా పని చేయాలనుకుంటే రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుంది. కాగా, వైట్ హౌజ్‌లో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో డొనాల్డ్ ట్రంప్ బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ట్రంప్‌నకు బైడెన్ అభినందనలు తెలిపారు. జనవరిలో సజావుగా అధికార మార్పిడి జరిగేందుకు సహకరిస్తానని బైడెన్ పేర్కొన్నారు.

జార్ఖండ్ తొలి విడతలో 66% పోలింగ్

జైపూర్: జార్ఖండ్‌లో మొదటి విడతలో భాగంగా బుధవారం 43 స్థానాలకు ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. రాత్రి 10 గంటల సమయానికి 65 శాతం ఓటింగ్ నమోదైంది. తొలి దశలో మాజీ సీఎం చంపయీ సోరేన్, మాజీ సీఎం మధు కోడా భార్య, మాజీ ఎంపీ గీతా కోడా సహా 683 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ నెల 20న రెండో విడత పోలింగ్ జరగనుంది. 23న ఫలితాలు వెలువడనున్నాయి. మరోవైపు, దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లోని 31 అసెంబ్లీ సీట్లకు, కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానానికి కూడా బుధవారం ఉప ఎన్నికలు జరిగాయి. వయనాడ్‌లో 65 శాతం, అసెంబ్లీ ఉప ఎన్నికల్లో 55 నుంచి 90 శాతం పోలింగ్ నమోదైంది.

ఇందిరాగాంధీ మళ్లీ తిరిగొచ్చినా..

అధికరణ 370 పునరుద్ధరణ అసాధ్యం

కేంద్ర హోం మంత్రి అమిత్‌షా

ముంబై: దివంగత మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ మళ్లీ తిరిగొచ్చినా అధికరణ 370ని పునరుద్ధరించడం సాధ్యం కాదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల సందర్భంగా అమిత్ షా బుధవారం ధూలే, పర్భని, జలగావ్‌లలో మహాయుతి తరఫున ప్రచారం చేశారు. మహా వికాస్ అఘాడీలోని కాంగ్రెస్, శివసేన (యూబీటీ)లపై విరుచుకుపడ్డారు. దళితులు, గిరిజనులు, ఇతర వెనుకబడిన కులాల కోసం ఉద్దేశించిన రిజర్వేషన్లను ముస్లింలు పొందలేరన్నారు.

న్యాయ సేవల కమిటీ చైర్మన్‌గా

జస్టిస్ సూర్యకాంత్

న్యూఢిల్లీ, నవంబర్ 13: సుప్రీం కోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్‌గా జస్టిస్ సూర్యకాంత్ నియమితులయ్యారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆయన పేరును నామినేట్ చేశారు. మంగళవారం ఈ మేరకు నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) ఓ నోటిఫికేషన్ జారీచేసింది. సుప్రీంకోర్టు పరిధిలోని కేసుల్లో పేదలు, బలహీన వర్గాలకు న్యాయ సాయం అందించేందుకు లీగల్ సర్వీసెస్ కమిటీని ఏర్పాటుచేశారు.

భారత్‌లో తొలి హైడ్రోజన్ రైలు

న్యూఢిల్లీ, నవంబర్ 13: ప్రపంచంలోనే అతిపెద్ద రైల్వే నెట్‌వర్క్ కలిగిన భారతీయ రైల్వే రాబోయే కాలంలో 'హైడ్రోజన్'తో రైళ్లను నడిపేందుకు సిద్ధమవుతున్నది. తొలి హైడ్రోజన్ రైలుకు సంబంధించి పైలట్ ప్రాజెక్ట్ త్వరలో ప్రారంభం కాబోతున్నది. ఇందుకు సంబంధించి ట్రయల్ రన్స్ డిసెంబర్‌లో నిర్వహించనున్నారని అధికార వర్గాల ద్వారా తెలిసింది. హైడ్రోజన్ రైల్‌కు ప్రతి గంటకు 40 వేల లీటర్ల నీరు అవసరం. నీటి నిల్వ కోసం రైల్లో ప్రత్యేక ఏర్పాట్లుంటాయి. దేశవ్యాప్తంగా మొత్తం 35 హైడ్రోజన్‌తో నడిచే రైళ్లను ప్రవేశపెట్టాలన్నది ప్లాన్. ఇందుకోసం కావాల్సిన హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్స్ బిగింపు, ఇతర సౌకర్యాల ఏర్పాటుపై రైల్వే శాఖ దృష్టి సారించింది. ఒక్కో రైలుకు సుమారుగా రూ.80 కోట్లు ఖర్చు అవుతున్నదని రైల్వే అధికార ప్రతినిధి దిలీప్ కుమార్ చెప్పారు.

శబరిమల భక్తుల కోసం ఏఐ చాట్‌బోట్

తిరువనంతపురం, నవంబర్ 13: శబరిమల వెళ్లే భక్తులకు తమ తీర్థయాత్ర అనుభవాన్ని సులభతరం చేయడమే కాక, మరింత మెరుగుపర్చడానికి కృత్రిమ మేధ ద్వారా రూపొందించిన ఏఐ అసిస్టెంట్ 'స్వామి చాట్‌బాట్' లోగోను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ బుధవారం ఆవిష్కరించారు. పతనంతిట్ట జిల్లా యంత్రాంగం రూపొందించిన ఈ స్వామి చాట్‌బాట్ స్మార్ట్‌ఫోన్ ద్వారా అందుబాటులోకి వస్తుంది. ఇంగ్లిష్, తెలుగు, హిందీ, మలయాళం, తమిళం, కన్నడలో మొత్తం ఆరు భాషల్లో ఇది సమగ్ర సేవలు అందిస్తుంది. దీని ద్వారా శబరిమల పూజా సమయాలు, రవాణా సౌకర్యాలు, ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్ల సమాచారం తదితర వివరాలు తెలుసుకోవచ్చు. అంతే కాకుండా పోలీస్, అటవీ శాఖల ద్వారా కూడా యాత్రికులకు సేవలు అందించి వారి తీర్థయాత్ర ఆనందకరం చేస్తుందని నిర్వాహకులు తెలిపారు.

చెన్నై దవాఖాన డాక్టర్‌పై రోగి కుమారుడి దాడి

చెన్నై: చెన్నైలోని కలైనార్ సెంటినరీ హాస్పిటల్ డాక్టర్‌పై బుధవారం ఓ రోగి కుమారుడు దాడి చేయడం కలకలం రేపింది. క్యాన్సర్ బాధితురాలు కాంచన ఈ దవాఖానలో ఆరు నెలల నుంచి చికిత్స పొందుతున్నారు. ఆమెకు సరైన చికిత్స అందడం లేదని ఆమె కుమారుడు విఘ్నేష్ భావించారు. అతడు బుధవారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో ఔట్‌పేషెంట్ రూమ్‌లో ఉన్న డాక్టర్ బాలాజీ జగన్నాథన్ (53) వద్దకు వెళ్లి, తన తల్లికి జరుగుతున్న చికిత్స గురించి ప్రశ్నించారు. అనంతరం ఇరువురి మధ్య వాదన జరిగింది. విఘ్నేష్ తీవ్ర ఆగ్రహంతో డాక్టర్ బాలాజీ మెడపై కత్తితో దాడి చేశాడు. ఏడుసార్లు ఆయనను పొడిచాడు. దవాఖాన సిబ్బంది వెంటనే డాక్టర్‌ను ఐసీయూకు తరలించారు. నిందితుడిని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ డాక్టర్లు, నర్సులు ధర్నా చేశారు.

సెక్సీయెస్ట్ మ్యాన్-2024గా జాన్ క్రసిన్‌స్కీ

లాస్‌ఏంజెల్స్: ప్రపంచంలోనే సెక్సీయెస్ట్ మ్యాన్ అలైవ్‌గా అమెరికా నటుడు, దర్శకుడు జాన్ క్రసిన్‌స్కీ ఎంపికయ్యారు. ప్రపంచంలో జీవించి ఉన్న వారిలో 2024 ఏడాదికి సెక్సియెస్ట్‌మ్యాన్‌గా క్రసిన్‌స్కీని ఎంపిక చేసినట్టు పీపుల్స్ మ్యాగజైన్ ప్రకటించింది. మంగళవారం జరిగిన ద లేట్ షో విత్ స్టీఫెన్ కొల్బెర్ట్ షోలో విజేతను ఎంపిక చేశారు. దీనిపై 45 ఏండ్ల జాన్ స్పందిస్తూ తనకు ఈ గౌరవం దక్కడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తన భార్య, నటి బ్లంట్ తన చిత్రాన్ని వారి ఇంటిలో వాల్‌పేపర్‌గా ఉపయోగిస్తానని చేసిన వాగ్దానాన్ని నెరవేర్చవచ్చునని చమత్కరించాడు. జాన్ ద ఆఫీస్, క్వయిట్ ప్లేస్, ఇఫ్‌తో పాటు అమెజాన్‌లోని యాక్షన్ సీరిస్ జాక్ ర్యాన్‌లలో మంచి పేరును తెచ్చుకున్నారు. క్వయిట్ ప్లేస్‌లో సహ రచయిత, దర్శకునిగా కూడా వ్యవహరించారు.

ఒక్కో ఎమ్మెల్యేకు బీజేపీ 50 కోట్లు ఆఫర్

కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

మైసూర్: బీజేపీపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య తీవ్ర ఆరోపణలు చేశారు. తన ప్రభుత్వాన్ని గద్దె దించడానికి బీజేపీ ఒక్కో కాంగ్రెస్ ఎమ్మెల్యేకు రూ.50 కోట్లు ఇస్తామని ప్రలోభ పెట్టిందని ఆరోపించారు. దానికి తమ ఎమ్మెల్యేలు ఎవరూ ఒప్పుకోకపోవడంతో బీజేపీ తనను అప్రతిష్ఠపాలు చేయడానికి తప్పుడు ఆరోపణలు చేసి కేసులు బనాయిస్తున్నదని విమర్శించారు. టీ నర్సిపుర నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను బుధవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒక్కొక్కరికి రూ.50 కోట్లు ఇస్తానని బీజేపీ అందని, అసలు అంత సొమ్ము వారికి ఎక్కడి నుంచి వస్తున్నదని ప్రశ్నించారు. వారు డబ్బునే మన్నా ప్రింట్ చేస్తున్నారా? అని ప్రశ్నించారు.